క్లుప్తంగా

సేవాలాల్ జయంతి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వర్ధన్నపేట : ఈనెల 18న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై సీఎంతో ఎమ్మెల్యే చర్చించారు. జయంతి ఉత్సవాల నిర్వహణపై సమాలోచనలు చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ మాజీ పాలకవర్గానికి సన్మానం



సంగెం : మండలంలోని ఆశాలపల్లి తాజా మాజీ సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్‌ను, పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామ యువజన నాయకుడు తోట ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. పదవీ కాలం ముగిసినప్పటికీ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం మాజీ సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం కేక్ కట్ చేసింది. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, బొల్ల పరశురామ్, దండు నాగరాజు, సాయి, ప్రశాంత్, ప్రవీణ్, రాజశేఖర్, దొంగల భరత్, బొల్లెబోయిన యశ్వంత్, ఉదయ్, పవన్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఆన్‌లైన్ ప్రక్రియకు సహకరించండి




చెన్నారావుపేట : గ్యాస్ ఆన్‌లైన్ ప్రక్రియకు ప్రజలకు సహకరించాలని ఖాదర్‌పేట స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓ శ్రీధర్‌రాజు కోరారు. మండలంలోని ఖాదర్‌పేట, జల్లి, ఎల్లాయగూడెం గ్రామాల్లో చేపట్టిన ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పలువురు దరఖాస్తు చేసుకోగా కొన్ని సరైన సమాచారం లేక తిరస్కరణకు గురైనట్టు తెలిపారు. అలాంటి వాటిని మళ్లీ ఆన్‌లైన్ చేయడానికి ఇంటింటికీ వెళ్లి వివరాలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యదర్శులకు పూర్తి వివరాలు అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీరన్న, మహేశ్, అవినాశ్ ఉన్నారు.

సదరం క్యాంపులో వైకల్య నిర్ధారణ పరీక్షలు



వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన సదరం క్యాంపులో 135 మంది దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు చేశారు. అర్హులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ అందజేయనున్నట్లు డీఆర్‌డీపీ పెన్షన్ విభాగం అధికారులు తెలిపారు. శిబిరంలో డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరపిస్ట్ నర్సింహారెడ్డి, వేణు, సైకాలజిస్ట్ వీరయ్య, డాక్టర్ భరత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డీఆర్‌డీపీ సదరం విభాగం అధికారులు కుమార్, శైలజ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట : పట్టణంలోని కమలాపురానికి చెందిన మహ్మద్ రఫీ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం గుడెపు భాగ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మోదీ చొరవతోనే 'పీవీ'కి భారతరత్న

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

నర్సంపేట రూరల్ : ప్రధాని నరేంద్ర మోదీ చొరవతోనే మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు భారతరత్న అవార్డు లభించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. పీవీ జన్మస్థలమైన మండలంలోని లక్నేపల్లిలోని పీవీ స్మారక మందిరంలో ఆయన విగ్రహానికి రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. పీవీ.నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి నర్సింహరాములు, రేసు శ్రీనివాస్, కంభంపాటి పుల్లారావు, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, నల్లబెల్లి సుదర్శన్, బుసాని సుదర్శన్, ముత్తినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు మినుముల రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీపీ ఆధ్వర్యంలో..

నర్సంపేట : పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద పీవీ.నర్సింహారావు చిత్రపటానికి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రణయ్‌దీప్ మాట్లాడారు. పీవీని బహుబాషా కోవిదుడుగా కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధూ, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, డీవైఎఫ్ఐ పట్టణ సెక్రటరీ గడ్డమీది బాలకృష్ణ, నాయకులు ప్రశాంత్, శ్రీకాంత్, వినయ్, ప్రవీణ్‌రామ్, చరణ్, అర్జున్, కల్యాణ్, పవన్, నవీన్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : లక్నేపల్లిలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రవికుమార్



వర్ధన్నపేట : పీవీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కేశవరెడ్డి, నాయకులు

పీవీ చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పీవీ.నర్సింహారావు చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, నాయకులు రాజ్‌కుమార్, గిరిప్రసాద్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెళకువలు కీలకం



ఖానాపురం : రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ఖానాపురం : పంటల సాగులో మెళకువలు పాటించడం కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్తలు వీరన్న, సతీశ్ చంద్ర, అశ్విని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని వరి పొలాలను శుక్రవారం వారు సందర్శించి పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు ఆశిస్తున్నట్లు గుర్తించారు. మొగి పురుగు నివారణకు నాట్లు వేసిన 15-20 రోజుల మధ్య పొలాల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4జీ నాలుగు కిలోలు లేదా క్లోరాన్ ట్రనిలిపోల్ 0.4జి 4 కిలోలు, లింగాకర్షక బుట్టలు 4, దీపపు ఎరలను అమర్చుకోవాలని సూచించారు. ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా ఫిప్రోనిల్ 0.3జీ గుళికలు ఎకరాకు 6 కిలోలు చల్లుకోవాలని చెప్పారు. చౌడు సమస్య ఉన్న పొలాల్లో రెండో దఫాగా పైపాటుగా యూరియాతోపాటు 100 గ్రాముల కార్బెండైజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని చల్లుకోవాలని తెలిపారు. పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. యూరియాను అధిక మోతాదులో వాడొద్దని, నీటి నిల్వ ఉండి పాకురు ఉన్న పొలాల్లో వేరుకుళ్లు, కింది ఆకులు ఎండిపోయిన క్రమంలో నివారణ కోసం 10 కిలోల యూరియాలో 150 గ్రాముల స్ప్రింట్‌ను కిలిపి చల్లాలని తెలిపారు. పొలాల్లో జింక్ లోప సవరణకు 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నూకాల సంతోశ్,, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని వరి పొలాలను ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ బి.సతీశ్ చంద్ర, డాక్టర్ డి.వీరన్న, అశ్విని సందర్శించారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చట్ల యాకయ్య, ఏఈఓ భారతి పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటివద్దే వైద్యసేవలు



వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగెం : 60 ఏళ్లకుపైబడిన వృద్ధులకు గ్రామాల్లో ఇళ్ల వద్దే ప్రతినెలా వైద్యసేవలు అందిస్తామని రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి తెలిపారు. మండలంలోని బీకోజీనాయక్ తండాలో రెడ్‌క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వృద్ధులకు ప్రతినెలా ఇంటి వద్దే బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వృద్ధులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ జి.కిషన్‌రావు, తాహెర్ మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, పవన్, రమేశ్, సుమంత్, బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా అధ్యక్షుడు సపావత్ మహేందర్, నాయకుడు వంశీ పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ఖానాపురం : గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్, ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు, నీటి సంపులను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుద్ధ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుప్రజ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు

నల్లబెల్లి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులను చేపట్టారు. తహసీల్దార్ రాజేశ్ మాట్లాడారు. కార్మికులు నిరంతరం పనులు చేపట్టాలని చెప్పారు.



నల్లబెల్లి : పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రాజేశ్

అవగాహనతోనే హెచ్ఐవీ నిర్మూలన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చెన్నారావుపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారానే హెచ్ఐవీని నిర్మూలించగలమని డాప్కో డీపీఎం స్వప్న మాధురి, వైఆర్జీ కేర్ డీఆర్పీ జ్యోతి, లింక్ వర్కర్ వీరన్న, లింగన్న, కవిత తెలిపారు. మండల కేంద్రంలో తోట కళారంజని సందీప్ కళాబృందం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై శుక్రవారం కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం స్వప్న మాధురి, డీఆర్పీ జ్యోతి మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరు హెచ్ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్ఐవీ సోకే అవకాశాలను వివరించారు. బాధితులు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాకారులు పొలెపాక సందీప్, కరుణాకర్, శంకర్, రజిని, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్

నర్సంపేట : ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్ నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ తెలిపారు. పట్టణంలోని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మండల స్టాకిస్ట్ పాయింట్ ప్రాంగణంలో భారత్ బంద్ కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మునీశ్వర్ మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అక్కపెల్లి రమేశ్, కావడి మల్లయ్య, సతీశ్, కిశోర్, మహేందర్, రవి, చొప్పరి కుమారస్వామి, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : ఈనెల 16న తలపెట్టిన భారత్ బంద్ కార్యక్రమ కరపత్రాలను మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బంద్ తలపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, మల్లయ్య, లక్క కుమార్, కుమారస్వామి, సాంబయ్య, పాణి, నర్సయ్య, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తునికాకు టెండర్లు పిలవాలి

నర్సంపేట : నర్సంపేట రేంజ్ పరిధిలోని మండలాల్లో తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ రవికిరణ్‌కు అఖిల భారత రైతు కూలి సంఘం, న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేందర్, ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. డివిజన్‌లోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం మండలాలతోపాటు రెడ్లవాడ, తదితర గ్రామాల్లో గతేడాది తునికాకు టెండర్లు పిలవకపోవడంతో వేసవిలో గిరిజన పేదలు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడిందని చెప్పారు. ఇప్పటికైనా వెంటనే టెండర్లు పిలవాలని కోరారు. గతంలో ఆకు సేకరించిన వ్యవసాయ కూలీలకు బకాయి ఉన్న బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, బుర్ర వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థినుల మృతి ప్రభుత్వ హత్యే'

ఖానాపురం : భువనగిరి జిల్లాలోని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినుల అనుమానాస్పద మృతి ప్రభుత్వ హత్యేనని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కళ, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షులు జనగాం కుమారస్వామి అన్నారు. మండలంలోని బుధరావుపేటలోని భవ్య కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థినులు అనుమానాస్పదంగా మృతి చెంది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు నిందితులను గుర్తించలేదని, చర్యలు తీసుకోలేదని చెప్పారు. భవ్య, వైష్ణవిల మృతి విద్యార్థినుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తోందన్నారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులు సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా నాయకుడు కేశోజు లక్ష్మయ్య, చైతన్య మహిళా సంఘం బాధ్యులు అనిత, విలాసిని, రమ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు అభినందనలు



వర్ధన్నపేట : అవిశ్వాస తీర్మానం వీగిపోయిన తర్వాత తొలిసారిగా తన కార్యాలయానికి శుక్రవారం వచ్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణకు మున్సిపల్ కమిషనర్ జోనా, కార్యాలయ సిబ్బంది కిరణ్, శ్రవణ్ అభినందనలు పలికారు. అనంతరం చైర్‌పర్సన్ అరుణ పట్టణంలోని పిరంగిగడ్డ ప్రాంతంలో రూ.500 గ్యాస్ సబ్సిడీ పథకం కోసం దరఖాస్తుదారుల నుంచి వివరాల నమోదు ప్రక్రియను సందర్శించి పరిశీలించారు.

ఎస్సారెస్పీ ఉపకాల్వలో పూడికతీత పనులు ప్రారంభం



రాయపర్తి : మండలంలో ఎస్సారెస్పీ ఉపకాల్వలో పూడికతీత పనులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని మహబూబ్‌నగర్‌లోని బొజ్జన్నకుంటకు నీళ్లు తెప్పించేందుకు పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పెండ్లి మహేందర్‌రెడ్డి, ఇల్లందుల భగవాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మొగిలి, నాయకులు రాజు, ఎల్కపల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్‌తో ఆరోగ్య పరిరక్షణ



నర్సంపేట : ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్-303 క్యాబినెట్ సెక్రటరీ, నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ హెల్త్ కార్డులను నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆడెపు సదానందం, మహ్మద్, నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శులు బత్తిని సాంబయ్య, ఈసాల లక్ష్మయ్య, 18వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, దూశెట్టి రఘుగౌడ్, నాయక్ పాల్గొన్నారు.

మజీద్-ఏ-నూర్ కమిటీ ఎన్నిక

రాయపర్తి : మండల కేంద్రంలో మజీద్-ఏ-నూర్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సదర్‌గా హుస్సేన్, నాయబ్ సదర్‌గా ఇక్బాల్, సెక్రటరీగా రజాక్, కోశాధికారిగా మహ్మద్ యూసుఫ్, కార్యవర్గ సభ్యులుగా షకీల్, జహీర్, ఫిరోజ్, సాజిద్, అఫ్రోజ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని ముస్లింలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మద్యం విక్రయాల బంద్‌కు ఉద్యమిస్తాం

సంగెం : పల్లెల్లో మద్యం విక్రయాలను బంద్ చేయించేలా ఉద్యమిస్తామని అఖిల భారత మహిళ సమైక్య మండల అధ్యక్షురాలు రేణుక తెలిపారు. మండలంలోని కుంటపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమైక్య ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు కొనసాగుతుండడంతో మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలు, బాలికలు బయటకు వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారని చెప్పారు. పలు వైన్స్ షాపుల నుంచి గ్రామాల్లోని కిరాణా షాపుల్లో సైతం విక్రయానికి మద్యం సరఫరా చేస్తున్నా ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. సంపూర్ణ మద్య నిషేధంతోనే మహిళలకు రక్షణ లభిస్తుందని స్పష్టం చేశారు. మండలంలో మద్యం విక్రయాలను ప్రభుత్వం నిలిపేసేలా మహిళలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు భాగ్యమ్మ, స్వరూప, విమల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ప్రజలకు సుపరిపాలన

- మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

నర్సంపేట : బీజేపీతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తెలిపారు. ‘గావ్ చలో అభియాన్’ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 161, 162వ బూత్‌ల పరిధిలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, సామాజిక వేత్తలు, వైద్యులు, ఇతర వర్గాలను శ్రీరాములు ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం కలిసింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి చేపట్టాక అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటోందని తెలిపారు. రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, రవీందర్ సింగ్, పృథ్వీ, బూత్ అధ్యక్షులు వల్లాజి నరేందర్, ఠాకూర్ విజయ్‌సింగ్, ప్రతిజ్ఞసింగ్, శివంజన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మోహన్‌రావుతో మాట్లాడుతున్న శ్రీరాములు

సీఐగా చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ



చెన్నారావుపేట : ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ చంద్రమోహన్

నెక్కొండ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ఎస్.చంద్రమోహన్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సీసీఆర్‌బీ విభాగంలో సీఐగా విధులు నిర్వహించిన ఆయనను ఇక్కడకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. మండలంలో విధులు నిర్వహించిన బి.హతీరాం మల్టీజోన్-1 ఐజీకి అటాచ్ చేశారు. విధుల్లో చేరిన సందర్భంగా సీఐ చంద్రమోహన్ మీడియాతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని చెప్పారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. బాధితులు తనను నేరుగా కలవవచ్చన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

చెన్నారావుపేట : సీఐ చంద్రమోహన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్సై పస్తం శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆటోడ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని, లైసెన్స్ కలిగి ఉండాలని, తప్పనిసరిగా ఆటోకు బీమా చేయించుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ స్వామి, సిబ్బంది ఎల్లయ్య, జంపయ్య, స్వామినాయక్, తిరుపతి, సురేశ్, అరవింద్, జ్ఞానేశ్వర్, స్వామి, నరేశ్, జ్ఞానేశ్వర్, పూలమ్మ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

రాయపర్తి : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన టౌన్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. శ్రేణులు ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా చొరవ చూపాలని సూచించారు. నిత్యం ప్రజల్లోనే ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ కుంట రమేశ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్‌రెడ్డి, ఇల్లందుల భగవాన్, సోడెపు శ్రీను, మచ్చ నీలయ్య, గారె భిక్షపతి, కోతి వీరన్న, చందు లింగయ్య, పీరని మారయ్య, ఉబ్బని అశోక్, రఫీ, కుంట రాజు, నల్ల మహేందర్, కల్యాణ్, రియాజ్, ప్రవీణ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

బలరాంనాయక్‌కు అన్ని సంఘాల మద్దతు

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్

నెక్కొండ : కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్‌కు అన్ని కుల, ప్రజాసంఘాల మద్దతు ఉందని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలరాంనాయక్ మహబూబాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలోనూ విశేష కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న బలరాంనాయక్‌కు ఆ పార్టీ టికెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ నాయక్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు నవీన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్, జిల్లా నాయకులు అవినాశ్‌నాయక్, భూక్య హరిసింగ్ నాయక్, సమ్మయ్య, బానోతు శ్రీకాంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.